సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం, 27, ఏప్రిల్, 2025



ఎండ.. జాగ్రత్తలే అండ..!

ఉమ్మడి జిల్లాలో ఎండల తీవ్రత పెరిగింది. ఈమేరకు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. IIలో▸



'బాల్య వివాహ ముక్త్' కోసం కృషి

బాల్య వివాహ ముక్త్ భారత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. IIIలో▸

గరిష్ఠం/కనిష్ఠం
37.0/27.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

సాయిచైతన్యకు సన్మానం



సాయి చైతన్యను సన్మానిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: ఇటీవల ప్రకటించిన యూపీఎస్సీ ఫలితాల్లో ఐఏఎస్‌కు ఎంపికైన ఉట్నూర్‌కు చెందిన సాయి చైతన్య జాదవ్‌ను కలెక్టర్ రాజర్షి షా శనివారం సన్మానించారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు.

జిల్లా కీర్తిని చాటిన సాయిచైతన్య

ఆదిలాబాద్‌టౌన్: సాయిచైతన్య జిల్లా కీర్తిని జాతీయ స్థాయిలో చాటారని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఆయనను శనివారం శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. యువత సాయిచైతన్యను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం



ఉద్యోగులతో కలిసి వీసీబీని ప్రారంభిస్తున్న ఎస్ఈ జేఆర్ చౌహాన్

ఆదిలాబాద్‌రూరల్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కన్‌స్ట్రక్షన్ సీఈ, జిల్లా ఇన్‌చార్జి ఎస్ఈ జేఆర్ చౌహాన్ అన్నారు. మావల మండలంలో ఏర్పాటు చేసిన వాక్యూం కరెంట్ బ్రేకర్ (వీసీబీ)ను శనివారం ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో భాగంగా వీసీబీ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఈలు హరికృష్ణ, ప్రభాకర్, ఈదన్న, ఏడీఈ లక్ష్మణ్, ఏఈ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల వేలానికి స్పందన కరువు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని దుకాణాలను అద్దెకిచ్చేందు కోసం శనివారం నిర్వహించిన బహిరంగ వేలం ప్రక్రియకు స్పందన కరువైంది. పట్టణంలోని వినాయక్ చౌక్‌లో గల శివాలయం రోడ్‌లోని షాపు నంబర్ 4, 5, ఓల్డ్ మున్సిపల్ కార్యాలయ భవనంలో షాపు నంబర్ 10, 11, 12, 14, 17, 28, 29, 30, అశోక్ రోడ్‌లోని షాపు నంబర్ 36, ఓల్డ్ బస్టాండ్‌లో షాపు నంబర్ 4, 5, శివాజీ రోడ్‌లో షాపు నంబర్ 1కి శనివారం వేలం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. అయితే వీటిపై వ్యాపారులు అంతగా ఆసక్తి చూపలేదు. వేలంలో పాల్గొనేందుకు ఇతరులకు రూ.50వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.25వేల నాన్ రిఫండబుల్ సెక్యూరిటీ డిపాజిటిగా ఉండటమే ఇందుకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఏ ఒక్క షాపునకు దరఖాస్తు రాకపోవడంతో బల్దియా అధికారులు వేలం ప్రక్రియను మే 6వ తేదీకి వాయిదా వేశారు. ఆసక్తి గల వ్యాపారులు సెక్యూరిటీ డి పాజిట్‌తో మే 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు మున్సిపల్ కార్యాయలంలో దరఖాస్తులు అందజేయాలని కమిషనర్ సీవీఎన్. రాజు సూచించారు. 6న ఉదయం 11గంటలకు వేలం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

29న జాబ్ మేళా

కైలాస్‌నగర్: శ్రీరాం చిట్స్ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగాల కల్పన కోసం ఈ నెల 29న జిల్లా కేంద్రంలోని సాత్నాల క్వార్టర్స్‌లో గల ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా ప్రకటనలో తెలిపారు. 23 నుంచి 32 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. జిల్లాలోని ఆసక్తి గల యువకులు తమ బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్లతో పాటు ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్ ప్రతులతో ఉదయం 10.30గంటలకు హాజరుకావాలని ఆమె సూచించారు.

సరదా సరదాగా..



శిబిరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు(ఫైల్)



కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పట్ట విద్యార్థులు వేసవి సెలవుల్లో సరదాగా గడిపేందుకు ఈ సారి విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. వారికి ఆటపాటలు అందించేలా వేసవి శిబిరాలకు శ్రీకారం చుడుతోంది. ఒకప్పుడు సమ్మర్ హాలీడేస్ వచ్చాయంటే పిల్లలు కోతికొమ్మచ్చి, దాగుడు మూతలు, కబడ్డీ, ఖోఖో, గోలీలు, మామిడి బుర్రలు వంటి ఆటలాడేవారు. సరదాగా ఈతకు వెళ్లేవారు. ఈ క్రమంలో వారి మధ్య స్నేహానుబంధం పెరిగేది. కొత్త విషయాలు నేర్చుకునేవారు. నాయకత్వ లక్షణాలూ అలవడేవి. శారీరక ధృఢత్వంతో పాటు ఉల్లాసంగా గడిపేవారు. అయితే సెల్‌ఫోన్ రాకతో ఇవి కనుమరుగయ్యాయి. ప్రస్తుతం సెలవులు వచ్చాయంటే చాలు పిల్లలు మొబైల్స్‌కే అతుక్కుపోతున్నారు. ఇది వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల్లో ఆహ్లాదంతో పాటు వినోదం పంచేందుకు ప్రభుత్వం వేసవి శిబిరాల నిర్వహణకు సిద్ధమైంది. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆటాపాటలు నేర్పించాలని భావిస్తోంది. మే 1నుంచి 15వరకు వీటిని నిర్వహించాలని యోచిస్తోంది. సర్కారు బడుల వైపు విద్యార్థులను మళ్లించేందుకు సైతం ఈ కార్యక్రమం దోహద పడనుంది.
– ఆదిలాబాద్‌టౌన్

- సర్కారు బడుల్లో సమ్మర్ క్యాంపులు
- ప్రణాళిక సిద్ధం చేస్తున్న విద్యాశాఖ
- రూ.25లక్షల బడ్జెట్‌తో ప్రతిపాదనలు
- ఆటపాటలు అందించేలా రూపకల్పన

జిల్లాలో	
ఉన్నత పాఠశాలలు	109
మొత్తం విద్యార్థులు	25 వేల మంది

విద్యార్థులు ఆటపాటలంటే ఎంతో ఇష్టపడతారు. వేసవి సెలవుల్లో వీటిని అందిస్తే వారి ఆరోగ్యంతో పాటు మేధాశక్తి సైతం పెంపొందనుంది. అలాగే అన్నిరంగాల్లో ప్రావీణ్యం పొందేందుకు అవకాశం ఉంటుంది. వీటిని గుర్తించిన విద్యాశాఖ ఈ సారి వేసవిలో ప్రత్యేక శిబిరాలపై దృష్టి సారించింది. విద్యార్థులకు మట్టి బొమ్మల తయారీ, సైన్స్ పరికరాలపై అవగాహన, మ్యూజిక్, కథలు చెప్పడం, చిత్రలేఖనం, వ్యక్తిగత వికాసం, వ్యాయామం, ఇండోర్ గేమ్స్, ఇలా అనేక అంశాలను నేర్పించేందుకు సన్నద్ధమవుతోంది. దీంతో ఏటా వేసవిలో మూతబడే బడులు ఈ సారి పిల్లలతో కళకళలాడే అవకాశం ఉంది. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం వేళలోనే వీటిని నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

నిర్వహణ కోసం ప్రతిపాదనలు..

శిబిరాలకు వచ్చే విద్యార్థులకు స్నాక్స్, ఇతర ఖర్చుల కోసం విద్యాశాఖ శాఖ అధికారులు రూ. 25లక్షలతో బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లాలో ఉన్న 109 ఉన్నత పాఠశాలల్లో నిర్వహించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శిక్షకుడికి పారితోషికం, మధ్యాహ్న భోజనం పెట్టే నిర్వాహకులు, విద్యార్థుల ఆట వస్తువుల నిర్వహణ, తాగునీరు, ఇతర వాటి కోసం ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలుస్తోంది.

సెల్‌కు బానిస కాకుండా..

ప్రస్తుతం ఏ ఇంట్లో చూసినా పిల్లల చేతుల్లో సెల్‌ఫోన్ దర్శనమిస్తూనే ఉంటుంది. చాలా మంది తల్లిదండ్రులకు ఇది తలనొప్పిగా మారింది. గంటల తరబడి మొబైల్స్‌లో లీనమవడం పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. కంటి చూపు సమస్య ఎదురవుతుంది. సమ్మర్ క్యాంపులతో వీటి నుంచి కొంత దూరం చేసే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్ల కోసం ఇప్పటికే ప్రచారం ప్రారంభించాయి.వారికి చెక్ పెట్టేందుకు సైతం ఈ క్యాంపులు దోహద పడనున్నాయి. సర్కారు బడులకు పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉంది.

పిల్లల్లో ఉత్సాహం నింపుతుంది



ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తామనడం సంతోషకరం. పిల్లలు చాలా మంది సెల్‌ఫోన్లకే అతుక్కుపోతున్నారు. ఆటపాటలను మరిచిపోయారు. మా చిన్నప్పుడు ఎన్నో ఆటలాడేవాళ్లం. ఇప్పటి పిల్లలు అవి మరిచిపోయారు. ఈ క్యాంపుల ద్వారా ఆటాపాటలు నేర్పించడం హర్షణీయం.
– పి.నారాయణ, మావల, విద్యార్థి తండ్రి

ఎంజాయ్ చేస్తాం..



ఇన్ని రోజులపాటు బడిలో చదుకున్నాం. సెలవుల్లో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తే సరదాగా అడుకుంటూ ఎంజాయ్ చేస్తాం. ఎండలో బయట తిరగవద్దని ఇంట్లో చెబుతున్నారు. పాఠశాలలోనే క్యాంప్ చేపడితే ఫ్రెండ్స్‌తో జాలీగా గడపవచ్చు. కొత్త కొత్త ఆటలు, పాటలు, కథలు నేర్చుకుంటాం.
– కె.నందిని, 9వ తరగతి, కేజీబీవీ, బంగారుగూడ

ప్రతిపాదనలు సిద్ధం చేశాం..



ఈ సారి విద్యాశాఖ ఆధ్వర్యంలో వేసవి శిబిరాలు నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఆటపాటలు, కథలతో పాటు సైన్స్ పరికరాల సమాచారం అందించాలని నిర్ణయించాం. ఈ క్యాంపులతో డ్రాప్‌అవుట్ సంఖ్య కూడా తగ్గుతుంది. ప్రభుత్వ పాఠశాలలు సైతం బలోపేతం అవుతాయి.
– శ్రీనివాస్‌రెడ్డి, డీఈఓ, ఆదిలాబాద్

'ఎర్లీబర్డ్'కు స్పందన అంతంతే!

- ముందుకు రాని పట్టణవాసులు
- మిగిలింది మూడు రోజులే
- ముందస్తుగా చెల్లిస్తే 5శాతం రాయితీ

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో..	
అసెస్‌మెంట్లు	49,503
వాటి ఆస్తి పన్ను డిమాండ్	రూ.33.46 కోట్లు
ఆస్తి పన్ను చెల్లించిన అసెస్‌మెంట్లు	3,993
ఇప్పటి వరకు వసూలైంది	రూ.1.40 కోట్లు



ఆస్తి పన్ను వసూలు చేస్తున్న బల్దియా సిబ్బంది

కైలాస్‌నగర్: మున్సిపాలిటీలో ఆస్తిపన్ను బకాయిలు పేరుకుపోకుండా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎర్లీబర్డ్ స్కీం అమలు చేస్తోంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తుగా పన్ను చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తోంది. నివాస, నివాసేతర భవనాలకు సంబంధించి పాత బకాయిలు లేనటువంటి వారిని అర్హులుగా ప్రకటించింది. ఈ నెల 30 వరకు పన్ను చెల్లింపునకు అవకాశం కల్పించింది. మరో మూడు రోజుల్లో గడువు ముగియనుంది. అయితే పట్టణ వాసుల నుంచి స్పందన కరువైంది. ఇప్పటి వరకు కేవలం నాలుగు శాతం మాత్రమే పన్ను వసూలు కావడం గమనార్హం.

అరకొర స్పందనే ...

ఆదిలాబాద్ పట్టణంలో 49 వార్డులున్నాయి. ఎర్లీబర్డ్ పథకం అమల్లో భాగంగా నిర్దేశించిన పన్ను వసూళ్ల కోసం బల్దియా అధికారులు 15 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ముగ్గురు ఉద్యోగులను నియమించారు. బకాయిలు లేని వారి వివరాలతో కూడిన జాబితాతో పాటు పీవోఎస్ యంత్రాలను వారికి అందజేశారు. దీంతో వారు ఉదయం, సాయంత్రం వేళల్లో కేటాయించిన వార్డుల్లో విస్తృతంగా తిరుగుతూ పన్నులు వసూలు చేస్తున్నారు. ఏటా ఆస్తి పన్నులో ప్రభుత్వం వడ్డీ మాఫీ అమలు చేస్తూ వస్తోంది. పాత బకాయిలు కలిగిన వారికి వడ్డీపై 95శాతం రాయితీ కల్పించింది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో బల్దియాకు అవసరమైన నిధులు సేకరించాలనే ఉద్దేశంతో ఎర్లీబర్డ్ స్కీం అమలు చేసి ఈ నెల 30 వరకు పన్ను చెల్లించేందుకు అవకాశం కల్పించారు. 2023–24లో ఇదే స్కీంలో రూ.1.83 కోట్లు వసూలు చేశారు. అలాగే 2024–25లో రూ.2.13 కోట్లను వసూలు చేశారు. తాజాగా గడిచిన 26 రోజుల వ్యవధిలో 3,993 మంది రూ.1.40 కోట్ల పన్నులను చెల్లించారు. మరో మూడు రోజులే గడువు ఉండటంతో గతేడాది లక్ష్యాన్ని అధిగమిస్తారా లేక వెనుకబడుతారా అనేది చూడాల్సిందే.

ప్రచారం కొరవడడంతోనే

ముందస్తుగా పన్ను చెల్లింపునకు పట్టణ ప్రజలు అంతగా ఆసక్తి చూపడం లేదు. అయితే ఐదు శాతం రాయితీ సద్వినియోగం చేసుకునేలా పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బల్దియా యంత్రాంగం ఆ దిశగా క్షేత్రస్థాయిలో ప్రచారం కల్పించకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. వ్యాపారులు పన్ను చెల్లింపునకు ముందుకొచ్చేలా గతేడాది పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లతో ప్రత్యేక ప్లెక్సీలను ఏర్పాటు చేశారు. అలాగే వార్డుల్లోని ప్రజలకు విషయం తెలియజేసేలా మైక్‌తో కూడిన ఆటో ద్వారా ప్రచారం కల్పించారు. ఈ యేడాది కేవలం ఒకటి రెండు చోట్ల మాత్రమే హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి మమ అనిపించారు. దీంతో ప్రజలకు అవగాహన కొరవడింది. ప్రత్యేక బృందాలు వెళితే తప్ప విషయం తెలియని పరిస్థితి. ఈ క్రమంలో బల్దియా ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సద్వినియోగం చేసుకోవాలి

పన్నులు ముందస్తుగా వసూలు చేసేందుకు ప్రభుత్వం ఎర్లీబర్డ్ స్కీం అమలు చేస్తోంది. ఈ నెల 30వరకు పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నాం. పట్టణంలోని వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– స్వామి, బల్దియా రెవెన్యూ అధికారి

ప్చ్.. ఇవేం ఏర్పాట్లు?

- బీఆర్ఎస్ రజతోత్సవానికి వెళ్లేందుకు పలువురి ఆసక్తి
- సరిపడా వాహనాలు ఏర్పాటు చేయలేదనే విమర్శలు
- శ్రేణుల్లో నిరుత్సాహం

సాక్షి, ఆదిలాబాద్: బోథ్ నియోజకవర్గంలోని ఓ మండలం.. అందులోని ఓ గ్రామం నుంచి బీఆర్ఎస్ రజతోత్సవానికి తరలివెళ్లేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తూ ముఖ్యనేతకు ముందే తెలియజేశారు. అయితే ఆ గ్రామం నుంచి మూడు వాహనాలు మాత్రమే ఏర్పాటు చేయడంతో మిగతా వారు సభకు వెళ్లలేని పరిస్థితి. శనివారం సాయంత్రం వరకు మరిన్ని వాహనాలు ఏర్పాటు చేస్తారా అని వారు ఎదురుచూశారు. అయితే వాహనాలు దొరకడం లేదనే సమాధానం ప్రధాననేత నుంచి రావడంతో వారిలో నిరుత్సాహం వ్యక్తమవుతుంది. ఈ ఒక్క గ్రామంలోనే కాదు.. జిల్లాలో పలుచోట్ల ఇదే పరిస్థితి.

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహిస్తున్న రజతోత్సవ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున గులాబీ శ్రేణులతో పాటు పలువురు అభిమానులు తరలివెళ్లేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే వారిని ఇక్కడి నుంచి తరలించే విషయంలో పార్టీ ముఖ్య నేతలు ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో సభకు వెళ్లలేక పలువురు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ వేదిక ద్వారా ఎలాంటి సందేశం పార్టీ శ్రేణులకు, ప్రజలకు ఇస్తారనే విషయంలో ప్రత్యక్షంగా చూడాలనే ఆసక్తి పలువురిలో ఉన్నప్పటికీ సరైన ఏర్పాట్లు లేని కారణంగా తాము అక్కడికి వెళ్లలేకపోతున్నామని పలువురు విమర్శిస్తున్నారు.

ఎక్కడ వైఫల్యం

బీఆర్ఎస్ రజతోత్సవ కార్యక్రమ విషయంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం కన్పిస్తున్నా దాన్ని అనుకూలంగా మలచుకోవడంలో స్థానిక నేతలు విఫలమవుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ అధిష్టానం ప్రతిష్టాత్మకంగా తీసుకుని జనసమీకరణ విషయంలో స్థానిక ముఖ్య నేతలకు బాధ్యతలు అప్పగించింది. ఈ నేపథ్యంలో వారం రోజులుగా ఏర్పాట్లలో వారు నిమగ్నమయ్యారు. ముందస్తుగానే ఆయా గ్రామాలు, వార్డుల నుంచి ఎవరేవరు వస్తారనే వివరాలను నాయకుల ద్వారా తీసుకున్నారు. అయితే అందుకు తగ్గట్లుగా వాహనాలు ఏర్పాటు చేయకపోవడంతో శనివారం సాయంత్రం జిల్లాలోని పలు గ్రామాల్లో తాము సభకు ఎలా వెళ్లేదనే విషయంలో పార్టీ శ్రేణులు, నాయకులపై కొంత గుర్రుగా ఉన్నారని తెలుస్తోంది. పార్టీ నుంచి ఫండ్ కూడా ముఖ్య నేతలకు చేరినప్పటికీ ఏర్పాట్ల విషయంలో ఎందుకు రాజీ అవుతున్నారనే విషయంలో శ్రేణుల నుంచి బాహాటంగానే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా పార్టీ అధినేత ప్రతిష్టాత్మకంగా తీసుకుని కార్యక్రమం చేపడుతుండగా ముఖ్య నేతల తీరుపై పలువురు పెదవి విరుస్తున్నారు. జిల్లా నుంచి కనీసం 10వేల నుంచి 15వేల మందిని చేరవేస్తామని చెబుతున్నా అందులో సగం మందిని తరలించే ఏర్పాట్లు లేవని శ్రేణులే చెప్పుకుంటున్నారు.

'భూ భారతి'పై విస్తృత చర్చ అవసరం

- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూభారతి చట్టంపై విస్తృత చర్చ జరగాలని, తద్వారా చట్టంపై అవగాహన కలిగి సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని రెవెన్యూగార్డెన్‌లో శనివారం నిర్వహించిన ఆదిలాబాద్ అర్బన్ మండల భూభారతి అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే శంకర్‌తో కలిసి సదస్సును ప్రారంభించారు. చట్టం విధి విధానాలపై అధికారులు రైతులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణి చట్టంలో లేని అనేక నిబంధనలను 1971 రెవెన్యూ చట్టంలోని మంచి అంశాలను తీసుకుని రైతులకు లబ్ధి చేకూర్చేలా భూభారతి చట్టాన్ని రూపొందించారన్నారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణితో అనేక అవస్థలు పడ్డ రైతులకు భూభారతితో మేలు చేకూరనుందని వెల్లడించారు. అనంతరం రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ విజయ్‌కాంత్, ఆర్ఐ యజువేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: ప్రభుత్వం నూతనంగా రూపొందించిన భూభారతి చట్టంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభించనుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండల కేంద్రంలోని సూర్య గార్డెన్‌లో శనివారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, తహసీల్దార్ ఎంఎ కలీం, డీటీ మహేశ్, ఆర్ఐ నాగోరావ్, ఎంపీడీఓ రాజ్‌వీర్, కుమారి పీఏసీఎస్ చైర్మన్ రమేశ్ రైతులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, పక్కన ఎమ్మెల్యే శంకర్ తదితరులు

మావలలో..

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో శంకర్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రతిభావంతులకు సన్మానం

కైలాస్‌నగర్: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులను కలెక్టర్ రాజర్షి షా శనివారం సన్మానించారు. తంతోలి గ్రామానికి చెందిన ఏ.అంజలి బైపీసీ సెకండియర్‌లో 955 మార్కులు సాధించగా, పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన డి.స్నేహ ఎంపీపీ ఫస్టియర్‌లో 467 మార్కులతో టాపర్‌గా నిలిచింది. కలెక్టర్ వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. జేఈఈ, ఎంసెట్ కోచింగ్‌కు అవసరమైన ఆర్థికచేయూత అందిస్తామని భరోసా ఇచ్చారు. ఇందులో డీఐఈవో జాదవ్ గణేశ్ కుమార్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూరజ్ తదితరులున్నారు.

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న జిల్లా జడ్జి ప్రభాకరరావు, అదనపు సెషన్స్ జడ్జి శివరాం ప్రసాద్

కైలాస్‌నగర్: ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా ఇటీవల జాతీయ అవార్డు అందుకున్న కలెక్టర్ రాజర్షి షాను జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకరరావు, అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి.శివరాం ప్రసాద్ సన్మానించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో శాలువాతో సత్కరించారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- వారం వ్యవధిలో జిల్లాలో 13 కేసులు

ఆదిలాబాద్‌టౌన్: సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో మాట్లాడారు. సైబర్‌క్రైమ్ బాధితులు వెంటనే ఫిర్యాదు చేస్తే బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. ఎవరైనా ఆన్‌లైన్‌లో మోసపోతే 1930, సైబర్‌క్రైమ్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ కేటుగాళ్లు వాట్సాప్‌లో వీడియోకాల్ చేస్తూ డిజిటల్ అరెస్టు పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. గుర్తింపు లేని వెబ్‌సైట్‌లను వెతకడం, ఓపెన్ చేయడంతో ఫోన్లు హ్యాక్ అవుతాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ గేమ్‌లు, బెట్టింగ్ యాప్‌లకు యువత దూరంగా ఉండాలన్నారు. సైబర్‌క్రైమ్‌కు సంబంధించి గడిచిన వారం వ్యవధిలో 13 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

జిల్లాలో నమోదైన కేసుల వివరాలు..

- ఓ మహిళ సోషల్ మీడియా అకౌంట్‌ను సైబర్ నేరగాళ్లు ఇటీవల దుర్వినియోగం చేశారు.తన పేరుతో అకౌంట్ క్రియేట్ చేసి కించపరుస్తున్నారని బాధితురాలు ఫిర్యాదు చేశారు.
- ఓ వ్యక్తి నుంచి ఫోన్‌ద్వారా క్రెడిట్‌కార్డు వివరాల తీసుకుని ఆన్‌లైన్‌లో రూ.27వేలు మోసం చేశారు. తనకు సంబంధం లేకుండా ట్రాన్జాక్షన్ జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు.
- జైనథ్ మండలంలోని ఓ గ్రామంలో పిల్లలు ఆడుకునే గేమ్స్ ద్వారా ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ అయి బాధితుడి అకౌంట్‌లో ఉన్న రూ.21 వేలు పోగొట్టుకోవాల్సి వచ్చింది.
- ఇచ్చోడ మండలానికి సంబంధించిన ఓ యువకుడు ఆన్‌లైన్‌లో ఫర్టిలైజర్స్ కోసం ఓ ఫేక్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. వారి సూచన మేరకు డబ్బులు పంపాడు. తదుపరి మోసపోయినట్లు గ్రహించి ఫిర్యాదు చేశాడు.

కేఆర్కే కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్



స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్కే కాలనీలో శనివారం రాత్రి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ పాల్గొని మాట్లాడారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 107 ద్విచక్ర వాహనాలు, ఆరు ఆటోలు, ఒక మినీ ట్రాలీని స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. అలాగే నాలుగు బెల్టు షాపులు గుర్తించడంతో పాటు 146 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్, మోడిఫైడ్ సైలెన్సర్లను బిగించిన 20 వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు ఫణిదర్, సునీల్‌కుమార్, సీహెచ్ కరుణాకర్, సాయినాథ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, వెంకటి, ఎస్సైలు, ఏఎస్సైలు, స్పెషల్ పార్టీ, రిజర్వ్ సిబ్బంది సుమారు 250 మంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆకాశవాణిలో కలెక్టర్ ముచ్చట



ముచ్చటలో కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రంలో కలెక్టర్ రాజర్షి షా ముచ్చట కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ఇటీవల నీతి ఆయోగ్ జాతీయ పురస్కారాన్ని అందుకున్న నేపథ్యంలో కలెక్టర్‌తో శనివారం ముచ్చట కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్రాంత సంచాలకులు సుమనస్పతి రెడ్డి కలెక్టర్‌తో ముచ్చటించారు. కేంద్రం ముఖ్య కార్యక్రమ అధికారి మాట్లాడుతూ నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ మండల కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం జాతీయస్థాయిలో ఘనతను సాధించిందన్నారు. దీని కృషి గురించి కలెక్టర్ వివరించారు. ఈ ముచ్చట కార్యక్రమం ఆదివారం ఉదయం 8.45 గంటలకు ఆకాశవాణిలో ప్రసారమవుతుందని తెలిపారు. అంతకుముందు పురస్కారం అందుకున్న తర్వాత తొలిసారిగా ఆకాశవాణి కేంద్రానికి వచ్చిన కలెక్టర్‌ను సిబ్బంది సత్కరించారు. ఇంజినీరింగ్ అధికారులు శశికాంత్, విజయకుమారి, వెంకటయ్య, క్యాజువల్ అనౌన్సర్లు పాల్గొన్నారు.

నేడు విద్యార్థుల ప్రత్యేక ప్రసారం

తలమడుగు మండలం సుంకిడికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్న ప్రత్యేక కార్యక్రమం ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమవుతుందని హెచ్‌ఎం పి.శ్రీనివాస్ స్వామి తెలిపారు. ఈనెల 23న విద్యార్థులు హిందీ భాషలో చెప్పిన గేయాలు, మహనీయుల జీవిత చరిత్రలపై ఆదివారం సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

ఇచ్చోడ: మండలకేంద్రంలోని పాత ఎస్సీ కాలనీలో శనివారం అగ్నిప్రమాదంలో మచ్చ నర్సింగ్‌కు చెందిన ఇల్లు పాక్షికంగా దగ్ధమైంది. మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో ఇంటికి నిప్పంటుకుంది. చుట్టుపక్కల వారు గమనించి మంటలార్పివేశారు. ప్రమాదంలో రూ.10 వేల నగదుతోపాటు నిత్యావసర సరుకులు, బట్టలు కాలిపోయినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎండ.. జాగ్రత్తలే అండ..!

సండే స్పెషల్

- ఉమ్మడి జిల్లాలో 45 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు
- భయపెడుతున్న వేడి గాలులు
- స్వీయరక్షణ చర్యలతోనే వడదెబ్బకు చెక్
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

ఉమ్మడి జిల్లాలో ఎండల తీవ్రత భగ్గుమంటోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్‌లోనే పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరడంతో సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఉదయం 9 గంటల నుంచే భానుడి భగభగలతో వేడి పెరుగుతోంది. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారులు ఇతరత్రా అత్యవసర పనుల్లో బయటకు వెళ్లక తప్పని పరిస్థితి. అధిక వేడి కారణంగా శరీరం నీరసంగా, నిస్సత్తువుగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలను పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. లేనిపక్షంలో వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇంట్లో ఉండేవారు సైతం తగు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

– కైలాస్‌నగర్/మంచిర్యాలటౌన్/నిర్మల్ చైన్‌గేట్



జాగ్రత్తలు పాటించాలి



ఎండలో తిరగడం, వడగాలులతో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంది. చిన్నారులు, వృద్ధులు త్వరగా డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశముంది. తగు జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బ బారిన పడకుండా ఉండవచ్చు. పనుల కోసం బయటకు వెళ్లేవారు ఉదయం 10 లోపు, సాయంత్రం 6గంటల తర్వాతే వెళ్లాలి. అత్యవసర పరిస్థితుల్లో గొడుగు, నెత్తికి టోపీ, రుమాలు ధరించాలి. వదులుగా ఉండే తెలుపురంగు గల కాటన్ దుస్తులు ధరించాలి. తరచూ నీటిని తాగుతుండాలి. ఉప్పు కలిపిన నిమ్మరసం, మజ్జిగ, ఓఆర్‌ఎస్ ద్రావణం, కొబ్బరినీళ్లు, పండ్లరసాలు తాగడం శ్రేయస్కరం.

– డా.ఆడే క్రాంతికుమార్, జనరల్ ఫిజీషియన్

వడదెబ్బ లక్షణాలు

శరీరంలో వేడి పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాడి వేగంగా కొట్టుకోవడం, నాలుక తడారిపోవడం, శరీరంలో నీటి శాతం కోల్పోవడం, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితికి చేరుకోవడం, ఫిట్స్, వాంతులు, విరేచనాలు వంటివి వడదెబ్బ లక్షణాలు. అలాంటి వారిని శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల కంటే తక్కువగా వచ్చే వరకు తడిగుడ్డతో శరీరమంతా తుడుస్తూ ఉండాలి. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలి. ముఖ్యంగా బీపీ, షుగర్ బాధితులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఎండలో బయటకు వెళ్లవద్దు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సివస్తే తలపై రుమాలు లేదా టోపీ ధరించాలి.
- నీరు, ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకుంటే శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడుకోవచ్చు.
- మద్యం సేవించడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది.
- తప్పనిసరిగా వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.
- ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి.
- చిన్నారులను ఎండలో ఆడనివ్వకూడదు. ఇంటి ఆవరణలో, చెట్ల నీడలో ఆడుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

కూలర్ వినియోగంలో జాగ్రత్తలు



- కూలర్లలో నీళ్ల పోశాక అటూ ఇటు కదల్చకూడదు.
- ఓపెన్ గదిలో వాడడంతో పాటు, గాలి ప్రవాహం ఉండేలా చూడాలి.
- కూలర్‌కు చల్లదనాన్ని ఇచ్చే గడ్డి, హానీకాంబ్ ప్యాడ్స్, ఫిల్టర్లు శుభ్రంగా ఉంచుకోవాలి.
- సమ్మర్ సీజన్‌లో కూలర్ వినియోగించడం అయిపోయాక క్లీన్ చేసి, వాటి తడకలు వేరుచేసి జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. అలాగే ఉంచితే వచ్చే ఏడాదికి అది పాడైపోతుంది.
- కూలర్‌ను కిటికీ దగ్గర కానీ, తలుపు దగ్గర కానీ ఉంచి వినియోగిస్తేనే ఎక్కువ గాలి వీస్తుంది. అలా కాకుండా ఇంటి మధ్య భాగంలో పెడితే అనుకున్నంత గాలి రాక ఇబ్బందులు పడుతారు.

వాషింగ్ మెషిన్ వాడకం



- రోజువారి వాడకానికి సరిపడా మోడ్‌ను సెలక్ట్ చేసుకోవాలి
- వేడి నీరు అవసరం లేనిదే వాడవద్దు
- ఎండలో ఉంచకుండా చూడాలి
- ఫిల్టర్లు నెలకోసారి శుభ్రం చేయాలి.

ఏసీల వినియోగం



- ఏసీలు 1 టన్, 1.5 టన్, 2 టన్స్ అని మూడు రకాలుగా దొరుకుతాయి. గది చిన్నగా ఉంటే 1 టన్, మధ్యస్తంగా ఉంటే 1.5 టన్, పెద్దదిగా ఉంటే 2 టన్స్ ఏసీలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది.
- ఏసీ గాలి బయటకు వెళ్లకుండా గది తలుపులన్నీ మూసి ఉంచాలి
- 24 నుంచి 26 డిగ్రీలలో ఏసీని సెట్ చేసుకుంటే గది ఉష్ణోగ్రతతో చల్లగా ఉండి విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది.
- ఏడాదిలో ఒకసారి ఏసీని తప్పనిసరిగా సర్వీసింగ్ చేయించాలి.
- స్టెబిలైజర్‌ను వాడడం మంచిది.

అవసరమైతేనే బయటకు వెళ్లాలి



వేసవిలో రోజుకు ఎనిమిది లీటర్లకు తక్కువ కాకుండా నీళ్లు తాగాలి. కుండలో నీళ్లు తాగడం ఉత్తమం. కాటన్ దుస్తులు ధరించాలి. బీపీ, షుగర్, గుండె జబ్బులు ఉన్న వారు ఎండలో ప్రయాణం చేయడం మంచిదికాదు.

– డాక్టర్ గోపాల్ సింగ్, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్, నిర్మల్

ఫ్రిజ్ వాడకం ఇలా..



- అవసరమున్నప్పుడే ఫ్రిజ్ డోర్ తీయాలి
- వేడి పదార్థాలను ఉంచకుండా చూసుకోవాలి.
- ఫ్రిజ్ వెనక భాగం శుభ్రం చేసుకోవాలి.
- డోర్ గాస్కెట్ లీక్ ఉందో లేదో చూసుకోవాలి.
- వెనుక భాగానికి గోడకి మధ్య కాస్త గ్యాప్ ఉంచాలి.

అప్రమత్తత అవసరం



ఎండల తీవ్రత మనుషులపైనే కాదు మూగ జీవాలు, పశుపక్షాదులపైనా తీవ్ర ప్రభావం చూపనుంది. అధిక వేడి కారణంగా జంతువులు ఉష్ణోగ్రతను నియంత్రించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతాయి. దీంతో ఊపిరాడక మృతి చెందే ప్రమాదం ఉంది. పశుగ్రాసం, నీటికొరత లేకుండా చూడాలి. ఎండలో ఎక్కువసేపు ఉంచవద్దు. వేడి తీవ్రత ను అధిగమించేందుకు గోనె సంచులను త డిపి వాటిపై కప్పితే చల్ల దనం లభిస్తుంది.

– బి.కిషన్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, ఆదిలాబాద్

ఇతరత్రా పరికరాలు

- టీవీని నేరుగా సూర్యకాంతికి పెట్టవద్దు. స్టెబిలైజర్ లేదా సర్జ్ ప్రొటెక్టర్‌ను వాడాలి.
- అవసరంలేని సమయాల్లో లైట్లను ఆర్పివేడయం వల్ల గదిలో వేడి తగ్గుతుంది.
- ఎల్‌ఈడీ బల్బులు వాడడం వల్ల హీట్ తక్కువగా ఉంటుంది. విద్యుత్ ఆదా అవుతుంది.
- విద్యుత్ పరికరాలు వేడి వాతావరణంలో వాడకుండా చూసుకోవాలి. వాడిన తర్వాత తప్పనిసరిగా ఆఫ్ చేయాలి.

వాహనాలకూ ఇబ్బందే..



బైక్‌లు, కార్లు ఎండలో నిలిపితే సూర్య కిరణాలు నేరుగా వాటిపైపడి కొద్ది కాలంలోనే రంగు వెలసిపోతుంది. తప్పనిసరిగా వాటిపై టార్పాలిన్ కవర్లు కప్పాలి. పెట్రోల్ ట్యాంక్ త్వరగా వేడెక్కి ఇందనం ఆవిరయ్యే అవకాశం ఉంది. ఉదయం 8 లోపు, సాయంత్రం 6 గంటల తరువాత వాహనాల్లో ఇందనం పోయించడం మంచిది. గ్యాస్‌కిట్లను ఉపయోగించే కార్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలి. గ్యాస్ ట్యాంక్‌పై మందంగా ఉన్న వస్త్రం లేదా గోనె సంచి కప్పి ఉంచడం వలన గ్యాస్ లీక్ కాకుండా ఉంటుంది. ఎండలో ఎక్కువ సమయం వాహనాలు నిలపడం వల్ల రేడియేటర్ హెడ్ గ్యాస్ కట్ అయ్యే అవకాశముంది. ట్రాఫిక్ జాం అయినప్పుడు సిగ్నల్స్ వద్ద కార్లలో ఏసీ వేయవద్దు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు వాహనాలకు విశ్రాంతి ఇవ్వాలి.– చెలిమల చంద్రమౌళి, మెకానిక్, మంచిర్యాల

ఎలక్ట్రిక్ బైక్‌లు హీట్ కానివ్వొద్దు



- ఎలక్ట్రిక్ బైక్‌ను వారానికోసారి శుభ్రం చేసి ఇంజన్, చైన్‌లలోని దుమ్ము, ధూళిని తొలగిస్తే ఇంజన్ సామర్థ్యం తగ్గకుండా ఉంటుంది.
- ఈవీ బైక్ ఎంత బరువు మోయగలదో అంతే బరువుతో ప్రయాణించాలి.
- ట్రాఫిక్‌లో చిక్కుకున్నప్పుడు, ఎక్కడైనా ఆగినప్పుడు ఇంజన్ ఆఫ్ చేయాలి. దీని వల్ల పవర్ ఆదాతో పాటు, లైఫ్ పెరుగుతుంది.
- ఈవీ బైక్‌లు లైట్ వెయిట్ ఉండడం వల్ల టైర్‌లో ఎంత ప్రెజర్ ఉందో తెలియదు. దానిని పట్టించుకోకుండా దీర్ఘకాలంపాటు ప్రయాణాలు చేస్తే ఇంజన్‌పై దుష్ప్రభావం పడుతుంది.
- ఈవీ బైక్‌ను చార్జింగ్ పూర్తయిన వెంటనే ప్లగ్‌ను తీసేయాలి. ఓవర్‌హీట్ అయితే బైక్‌లు దగ్ధమయ్యే అవకాశం ఉంది.

ఇంటి మొక్కలు జర జాగ్రత్త

- ఉద్యానవన శాఖ కాగజ్‌నగర్ డివిజన్ అధికారి సుప్రజ



చింతలమానెపల్లి: మార్కెట్‌లో కూరగాయల ధరలు మండుతున్నాయి. పండ్ల ధరలదీ అదే పరిస్థితి. పోషకాలతో కూడిన ఆహారం కావాలంటే పండ్లు, కూరగాయలు ఆహారంలో ఉండాల్సిందే. మరి వీటికి పరిష్కారం.. కిచెన్‌లో, ఇంటి కప్పు మీద రూఫ్‌లో, కూరగాయలు, పండ్లు, మొక్కలు పెంచుకోవడం. ఇంటిలో ఆహ్లాదకర వాతావరణం కోసం పూల మొక్కలు ఏర్పాటు చేసుకోవడం. గ్రామాలు, పల్లెలు అనే తేడా లేకుండా పట్టణాలుగా మారుతున్న వేళ ఇరుకు ఇళ్లు, అపార్ట్‌మెంట్ సంస్కృతిలో ఈమధ్య కిచెన్ గార్డెన్, రూఫ్ గార్డెన్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. మన ప్రభుత్వం మన పట్టణ ప్రాంత ఆవాసాల్లో పోషక పదార్థాలను ఇచ్చే కూరగాయలు పెంచే పథకం 'మన ఇల్లు–మన కూరగాయలు' పేరిట ప్రోత్సహిస్తోంది. కానీ.. పెరిగిన ఎండల వేడికి వీటిని కాపాడుకునేందుకు ఏం చేయాలి. వేల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ అర్బన్ ప్లాంటేషన్‌ల నుంచి లబ్ధి ఎలా పొందాలి. వీటిపై సలహాలు, సూచనలు, జాగ్రత్తలు ఉద్యానవన శాఖ కాగజ్‌నగర్ డివిజన్ అధికారి సుప్రజ అందించారు.

అర్బన్ ప్లాంటేషన్, కిచెన్ గార్డెన్, రూఫ్ గార్డెన్ అంటే వివరాలు తెలపండి?

ఈ పద్ధతిలో కూరగాయలు, పండ్లు, పూల మొక్కలను ఇంటి వద్దనే పెంచుకోవచ్చు. ప్రధానంగా పట్టణ సంస్కృతి కలిగి ఉండి, వ్యవసాయ స్థలాలు లేని వారికి ఇది ఉపయోగంగా ఉంటుంది.

మన ప్రాంతంలో ఇవి ఉన్నాయా?

మన జిల్లాలో ఇవి తక్కువగా ఉన్నాయి. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ లాంటి నగరాల్లో ఈ పద్ధతిలో సాగు చేస్తున్నారు. కానీ.. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోని భవనాల్లో ఆసక్తి ఉన్న వారు కూడా ఈ పద్ధతిలో సాగు చేస్తున్నారు. పూల మొక్కలు, పచ్చదనం కోసం విదేశీ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన మొక్కలు పెంచుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల వంట నిర్వాహకులూ పోషకాలు అందించే కూరగాయలు సాగు చేస్తున్నారు.

ఈ పద్ధతిలో సాగు చేస్తే కలిగే ఉపయోగాలేవి?

ఈ పద్ధతుల్లో సాగు చేసేవారికి తాజా కూరగాయలు, పండ్లు లభిస్తాయి. ఆరోగ్య రక్షణలో వీటి పాత్ర కీలకం. ఆరోగ్య రక్షణతో పాటు సేంద్రియ ఎరువులు, కూరగాయల వ్యర్థాలను ఎరువులుగా వినియోగించుకోవచ్చు. ఆర్థిక ప్రయోజనాలు కూడా ఉన్నాయి.

ఎండ వేడిమి నుంచి వీటి రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి.

మొక్కలు సాగు చేసే చోట గ్రీన్‌నెట్ షీట్స్ వినియోగించి ఎండవేడిమి నుంచి రక్షించుకోవాలి. ఇంటి దగ్గర సాగు చేసే మొక్కలను పరుచుకునేలా సాగు చేసుకోవాలి. కిచెన్‌లోని కూరగాయల వ్యర్థాలను మొక్కల వద్ద పరుచుకోవాలి. దీని ద్వారా కింద మట్టిలో ఉండే తేమను రక్షించుకోవచ్చు.

మొక్కలకు నీటిని అందించే పద్ధతులేమిటి?

ఆధునిక పరిజ్ఞానం వినియోగించే వారు ఇళ్లపై ఉండే నీళ్ల ట్యాంకులను వినియోగించి డ్రిప్ పద్ధతిలో మైక్రోజెట్‌లను ఏర్పాటు చేసుకోవాలి. ప్లాస్టిక్ సీసాలు, మట్టి కుండలు లాంటివి వినియోగించడంపై ఆన్‌లైన్‌లో చాలామంది నిపుణులు మెళకువలు తెలియజేస్తున్నారు.

ఎలాంటి మెళకువలు పాటించాలి?

మొక్కల పెంపకంలో ప్రధానంగా కొన్ని సూచనలు పాటించాలి. సూర్యరశ్మి లభ్యత, అందుబాటులో ఉన్న స్థలం, సాగునీటి లభ్యత, నీరు నిల్వ ఉంచే సామర్థ్యం (వాటర్‌ప్రూఫ్ ఇంటి కప్పు), మన అభిరుచి అవగాహన లాంటివి కీలకంగా పరిశీలించుకోవాలి.

ఎలాంటి మట్టిని వినియోగించుకోవాలి?

ఈ పద్ధతుల్లో పెంపకానికి మట్టి తయారీ కీలకంగా మారుతుంది. 20శాత ఎర్రమట్టి, 40శాతం వర్మీకంపోస్ట్, 20శాతం కొబ్బరి పీచుపొట్టు, 5శాతం వేపపిండి, 15శాతం పశువుల చివికిన ఎరువులు కలిపి తయారు చేసుకోవాలి.

ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఉందా?

ప్రభుత్వం ఈ పద్ధతుల్లో పట్టణాలు, నగరాల్లో పోత్సహించడానికి ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో 'మన ఇల్లు–మన కూరగాయలు' పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పద్ధతిలో శాఖ ద్వారా సలహాలు, సూచనలు అందిస్తున్నాం. ఇతర విషయాలు తెలుసుకోవాలంటే శాఖ అధికారులను సంప్రదించాలి.

చేపల కదలికలు గమనించాలి

- జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్



మంచిర్యాలఅగ్రికల్చర్: వేసవి వాతావరణ పరిస్థితుల్లో చేపల పెంపకంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. జలాశయాల్లో నీటి మట్టం తగ్గుతోంది. మత్స్యకారుల సంఘాలు, సభ్యులు జాగ్రత్తలు వహించాలి. చెరువులు, కుంటల్లో నీటిమట్టం తగ్గితే చేపలు పట్టుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్.అవినాష్ సూచించారు. వేసవి ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు వివరించారు. జిల్లాలో అధికంగా వర్షాధార చెరవులు, కుంటలు ఉన్నాయి. చెరువుల్లోని నీటి నాణ్యత, లోతు విస్తీర్ణం, చేపల కదలికలు ప్రతీ రోజు గమనించాలి. కొన్ని చేపలను పట్టి పెరుగుదల, రంగు, తోక, రెక్కల స్వభావం ఇతర లక్షణాలు పరిశీలించాలి. తేడా ఉన్నట్లయితే మత్స్యశాఖ అధికారి సలహాలు, సూచనలు తీసుకొని నివారణ, నియంత్రణ చర్యలు చేపట్టి ఆర్థిక నష్టాన్ని తగ్గించుకోవాలి. ఉదయం సమయంలో చెరువు పైభాగంలో చేపలు నోరు తెరుచుకొని తిరుగుతుంటే ప్రాణవాయువు కొరత ఉందని గ్రహించి చెరువులో నీరు పెట్టడం, పెద్దగా పెరిగిన చేపలను పట్టి విక్రయించడం చేయాలి. తద్వారా చేపల సాంద్రత తగ్గడం వల్ల ప్రాణవాయువు కొరతను అధిగమించవచ్చు. చెరువులో నీటి నాణ్యత తగ్గినప్పుడు సున్నాన్ని ఒక హెక్టారుకు 100 నుంచి 250 కేజీల వరకు చల్లడంతో నాణ్యతతోపాటు ప్రాణవాయువు శాతం పెరుగుతుంది. చెరువులో కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలి. లేకపోతే రాత్రి సమయంలో అవి విడుదల చేసే కార్బన్ డై ఆక్సైడ్ కారణంగా ప్రాణవాయువు కొరత ఏర్పడి చేపలు చనిపోయే ప్రమాదం ఉంటుంది. ఈ సందర్భాల్లో విషం కలిపారనే అపోహలను నమ్మకుండా నిజనిర్ధారణ చేసుకోవాలి. వ్యాధితో చేపలు చనిపోయిన వెంటనే వాటిని నీటి నుంచి తొలగించి చెరువు దూరంగా కాల్చివేయడం, భూమిలో పూడ్చి వేయడం చేయాలి. వెంటనే సున్నాన్ని ఒక హెక్టారుకు 100 నుంచి 250 కేజీల మోతాదులో చల్లాలి. ఇంకా అదుపులోకి రాకుంటే నీటి నాణ్యత పెంచే రసాయనాలు బీకేసీ(బెంజాల్ కొలియం క్లోరైడ్)ను ఒక హెక్టర్‌కు ఒక లీటర్ చొప్పున నీటిలో కలిపి చెరువులో చల్లాలి. అయినప్పటికీ మార్పు లేకపోతే యాంటీ బయోటిక్ మందులు సూచించిన మోతాదులో మేతతోపాటు కలిపి ఇవ్వాలి. నీటిని మోటార్ల ద్వారా రీసైక్లింగ్ చేసుకుంటే విష వాయువులు తగ్గి ప్రాణవాయువు శాతం పెంచుతుంది.

కుటుంబ కలహాలతో కొడుకు హత్య

- వెల్లడించిన నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా

లక్ష్మణచాంద:మండలంలోని మల్లాపూర్‌లో కుటుంబ కలహాలతో కొడుకును తండ్రి హత్యచేశారని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా తెలిపారు. జిల్లాకేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈమేరకు వివరాలు వెల్లడించారు. మల్లాపూర్‌కు చెందిన భైనం ఎర్రన్న, గంగవ్వ దంపతులకు ఇద్దరు సంతానం. ఇందులో కుమారుడు అశోక్, ఒక కూతురికి పెళ్లయింది. అశోక్‌కు లక్ష్మణచాందకు చెందిన లక్ష్మితో వివాహమై ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెళ్లయ్యాక ఉపాధి నిమిత్తం అశోక్ సౌదీ వెళ్లి స్వగ్రామానికి వస్తూ వెళ్తుండేవాడు. కూతురు జన్మించాక బెహరన్ వెళ్లాడు. సౌదీ, బెహరన్‌లో పనిచేస్తున్న సమయంలో ఇంటికి డబ్బులు పంపించేవాడు. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. నేను పంపించిన డబ్బులు ఏమయ్యాయని తండ్రితో తరచూ గొడవలు జరిగేవి. తన భార్య లక్ష్మికి తండ్రికి అక్రమ సంబంధం ఉందని అనుమానించి పిల్లలను ముట్టుకోవద్దని గురువారం గొడవపడ్డాడు. శుక్రవారం రాత్రి తండ్రి ఎర్రన్నతో గొడవపడి నిన్ను ఎలాగైనా చంపేస్తానని అన్నాడు. తనను చంపుతాడని భావించిన తండ్రి కుమారుడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. రాత్రి ఆరు బయట నిద్రిస్తున్న అశోక్ తల, ముఖంపై గొడ్డలితో నాలుగు సార్లు నరికాడు. అరుపులు విన్న భార్య గంగవ్వ బయటకు రాగా లోపలికి వెళ్లాలని బెదిరించాడు. తెల్లవారుజామున గ్రామ సమీపంలో పొలంలో గొడ్డలి పడేసి బస్టాండ్‌కు చేరుకున్నాడు. పోలీసులు పట్టుకుని విచారించగా హత్యచేసినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి గొడ్డలి, చరవాణి, ఒంటిపై గల రక్తపు మరకులు గల షర్టు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సై మాలిక్ రెహమాన్, సిబ్బందిని అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

భార్య హత్య కేసులో భర్త అనుమానాస్పద మృతి

గుడిహత్నూర్: గత మూడురోజుల క్రితం భార్యను భర్త హత్యచేశాడు. మండలంలో ఈ ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో పరారీలో ఉన్నాడనుకున్న భర్త అనుమానాస్పదంగా మృతిచెందాడు. సమీపంలోని వాగు పొదల్లో కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని శనివారం ఉదయం గ్రామస్తులు పరిశీలించి లట్‌పటే మారుతిగా గుర్తించారు. పథకం ప్రకారమే తాను చనిపోతే భార్య కీర్తి పరిస్థితి ఏంటనే క్రమంలో ఆమెను హత్యచేసి, ఆ తర్వాత వాగుపొదల్లో మారుతి దాగి స్ప్రైట్‌బాటిల్‌లో తెచ్చుకున్న విషాన్ని తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. గ్రామస్తుల సమాచారంతో ఏఎస్పీ కాజల్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టానికి రిమ్స్‌కు తరలించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. కాగా, భార్యను దహనం చేసిన మారుతి అంత్యక్రియలు నిర్వహించారు.

భార్య హత్యకు ముందు వాట్సాప్‌లో స్టేటస్..

ఆర్థికసమస్యలు, తన అక్రమ సంబంధం నేపథ్యంలో కుటుంబంలో కలహాలతో మారుతి ఆత్మహత్యకు ప్రణాళిక వేసుకున్నట్లు తెలుస్తోంది. ముందుగా భార్యను హత్య చేసి, ఆపై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య హత్యకు 15 నిమిషాల ముందు వాట్సాప్‌లో 'అంత్ కేవల్ మృత్యు హై'అని హిందీలో 'ది ఓన్లీ ఎండ్ ఈజ్ డెత్'అని ఇంగ్లిష్‌లో స్టేటస్ పెట్టాడు. అయితే ఈ దంపతుల మృతితో గాయత్రి (9), మహేశ్వరి (7), బద్రి (6) అనాథలుగా మిగిలారు. కాగా అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.



మారుతి మృతదేహం

రిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో తొమ్మిదేళ్ల పాపకు అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయిందని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తొమ్మిదేళ్ల పాప అండాశయంలో కేన్సర్‌తో బాధపడుతుండగా రిమ్స్‌లో చేరినట్లు తెలిపారు. ఆమెకు పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ దేవిదాస్ అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు పేర్కొన్నారు. సూపర్ స్పెషాలిటీలో మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. డాక్టర్ వివేక్ రాథోడ్ ద్వారా కొలొనోస్కోపి, ఈఆర్‌సీపీ, ఎండస్కోపి, పైల్స్‌కు ఆపరేషన్ లేకుండా చికిత్స, అల్కాహాల్ సేవించడం ద్వారా లివర్ దెబ్బతిన్న వారికి వైద్యసేవలందిస్తామన్నారు. త్వరలో మరిన్ని వైద్యసేవలు అందుబాటులోకి తీసుకవస్తామన్నారు. సమావేశంలో వైద్యులు సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఒంటరి జీవితం భరించలేక వ్యక్తి ఆత్మహత్య

తానూరు: ఒంటరి జీవితం భరించలేక వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు..మండల కేంద్రానికి చెందిన సాయినాథ్(40)– విజయ దంపతులు. వీరికి ఒక కుమారుడు(15), కుమార్తె (13) ఉన్నారు. సాయినాథ్ వ్యవసాయ కూలీగా ప నిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబా న్ని పట్టించుకోకపోవడంతో ఆరేళ్ల క్రితం ఇద్దరు పి ల్లలతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి ను ంచి ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈనెల 24న ఇంట్లో ఉరేసుకున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటిపక్కవారు గమనించగా ఇంట్లో ఉరేసుకుని సాయినాథ్ కనిపించాడు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. భార్య ఫిర్యాదుతో శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సాయినాథ్ (ఫైల్)